వాహనదారులు



తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డ నంబరు దాచిపెట్టిన వాహనాలు



నెంబరు ప్లేటు సరిగ్గా లేకుండా నడుపుతున్న వాహనదారులు



ప్లేట్ ఫిరాయిస్తే అంతే.!


నంబర్ కనబడకున్నా.. తీసేసినా క్రిమినల్ కేసులు

మీ బైక్ నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారా.. లేదా బండి నంబర్ నిబంధనలకు విరుద్ధంగా ఉందా.. ఒక నంబర్ తీసేసి తిరుగుతున్నారా.. ఇక జాగ్రత్త సుమా.! అలా వాహనంపై తిరుగుతూ పట్టుబడితే కటకటాల్లోకి వెళ్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహన దారులు చలాన్లు తప్పించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టి పలువురిపై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే వీరిలో మార్పు రాకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపిస్తున్నారు. అటు బాలనగర్ ఇటు మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ పోలీస్ స్టేషన్ల పరిధిలో శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో వాహనాలను గుర్తించి సీజ్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలా చిక్కితే ఐపీసీ 201, 471 ,468, 425, 418 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కటకటాలకు పంపిస్తున్నారు.

– కుత్బుల్లాపూర్



నెంబరు ప్లేటు సరిగ్గా లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



నంబరు లేని డీసీఎం




తస్మాత్ జాగ్రత్త



తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డ నంబరు దాచిపెట్టిన వాహనాలు

మురుగు సమస్యను పరిష్కరించరా.?



నందానగర రోడ్ నం.1లో మ్యాన్ హోల్‌లో కట్టెను ఉంచిన దృశ్యం



ఓ ఇంటి మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న మురుగు



నందానగర్‌లోని ఆంజనేయస్వామి అలయ వీధిలో పారుతున్న మురుగు



మ్యాన్‌హోల్ వద్ద దుర్గంధ భరింతంగా మారిన దృశ్యం

రంగారెడ్డినగర్: డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో వ్యర్థాలు నిండిపోవడంతో ఇళ్లల్లోని మురుగు బయటకు వెళ్లకుండా వెనక్కి తన్నుకు వస్తోంది. దీంతో మురుగు కంపు భరించ లేక స్థానిక ఇళ్ల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లోని రోడ్ నం.1లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి ప్రతినిత్యం మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రేపు.. మాపంటూ కాలం వెల్లదీస్తున్నారని వాపోతున్నారు. గత పదిహేను రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇళ్లల్లోని మురుగు వెనక్కి...

ఇళ్లల్లోని మురుగు వెనక్కి రావడంతో చేసేది లేక స్థానికంగా ఉన్న భూగర్భ మ్యాన్‌హోల్ మూతను తొలగించి కర్రతో తిప్పితే తప్ప ఇళ్లలోని మురుగు బయటకు రాని పరిస్థితి నెలకొంటోంది. అంతే కాకుండా మురుగు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ వీధిలోకి పారడంతో కంపు భరించలేక స్థానిక ఇళ్ల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డులో మొత్తం జామైన మ్యాన్‌హోళ్లు..

నందానగర్ రోడ్ నం.1లో అన్ని భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు చెత్తతో నిండిపోవడంతో తరచూ ఏదో ఒక సమయంలో రోడ్డుపై మురుగు ఉప్పొంగడంతో దుర్గంధభరితంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

కాంట్రాక్టర్లపై లోపించిన పర్యవేక్షణ..

ఏదైనా ప్రాంతంలో డ్రైనేజీ లైన్ జామైతే జలమండలి అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లకు పురమాయిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులు చేపట్టారా లేదా అనేది అధికారులు చూడటం లేదు. దీంతో తూతూ మంత్రంగా పనులు పూర్తి చేసి బిల్లులు తీసుకుంటున్నారు. ఇలా జలమండలి డబ్బులు చెల్లిస్తున్నా పర్యవేక్షణ లోపించడంతో ఎక్కడి డ్రైనేజీ అక్కడే జామ్ అవుతున్నా యన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మురుగు ఇంట్లోకి వస్తోంది.



మ్యాన్‌హోల్ జామై మా ఇంట్లోని నీరు వెనక్కి తన్నుకు వస్తోంది. ప్రతిరోజు సమీపంలోని డ్రైనేజీ మ్యాన్ హోల్ మూత తీసి కట్టెతో కొడితేనే ఇంట్లోని నీరు బయటకు వెళ్తోంది.. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మాకు ఎన్నాళ్లు ఈ తిప్పలు. వెంటనే మ్యాన్‌హోల్ శుభ్రం చేయించి సమస్యను పరిష్కంచండి.

– ఖాజా, నందానగర్ రోడ్‌నం.1

నాలాల నిర్మాణంతో వరద ముంపునకు చెక్



చంద్రగిరినగర్‌లో నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: నాలాల నిర్మాణంతో వరద ముంపు తొలగనుందని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. బుధవారం చంద్రగిరినగర్‌లో నిర్మిస్తున్న నాలా పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాలా పనులు పూర్తయితే స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యతో పాటు వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగు పరుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఏఈ కల్యాణ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయినాథ్ నేత, జ్ఞానేశ్వర్, మల్లేశ్వర్, సునీల్ పాటీల్, అన్నపూర్ణ, మురళి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కబ్జా నాలాను వదిలేసి.. కృత్రిమ నాలా నిర్మించడమేంటి?



నాలా నిర్మాణం విషయమై అధికారులను అడ్డుకున్న ఓక్షిత్ ఎన్‌క్లేవ్ వాసులు

పనులను అడ్డుకున్న ఓక్షిత్ ఎన్‌క్లేవ్ వాసులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లోని కృత్రిమంగా చేపడుతున్న నాలా నిర్మాణ పనులను బుధవారం కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో ఉపకమిషనర్ మల్లారెడ్డి, డీసీ రూప, ఏఈ కళ్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డిలతో కలిసి అక్కడికి చేరుకున్నారు. పనులు ఎందుకు అడ్డుకుంటున్నారని కాలనీవాసులపై మండిపడ్డారు. పనులను ముందుకు సాగనిచ్చేది లేదని స్థానికులు భీష్మించడంతో పోలీసులను రప్పించారు. దీంతో అధికారులు, కాలనీవాసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

◆ స్థానికంగా గాజులరామారం చెరువు దిగవ భాగాన ఉన్న కట్టు కాలువను కొంతమంది కబ్జా చేయడంతో గత రెండేళ్లుగా వర్షాకాలంలో కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో ప్రతి వర్షాకాలం తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం కబ్జాకు గురైన నాలాను పక్కనపెట్టి కాలనీలోని మూడు రోడ్ల గుండా మీటర్ చొప్పున కృత్రిమ నాలాను ఏర్పాటు చేస్తామని కాలనీవాసులతో ఒప్పందం కుదుర్చుకుని ఇప్పుడు ఒకే రోడ్డులో మూడు మీటర్ల నాలాను ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు.



ఇళ్ల మధ్య నుంచి నిర్మిస్తున్న నాలాను చూపిస్తున్న ఓక్షిత్ ఎన్‌క్లేవ్ వాసులు

◆ నాలా కోసం రోడ్లు తవ్వడంతో ఇళ్ల ప్రహరీ కోల్పోయి గోడలు బీటలు వారాయని కాలనీవాసులు పేర్కొన్నారు. అధికారులు తమ ప్రతాపం ఏదైనా ఉంటే నాలాను కబ్జా చేసిన వారిపై చూపించాలని కాలనీవాసులు అధికారులపై మండిపడ్డారు. ఏది ఏమైనా నాలా పనులు జరగనివ్వమని కరాకండిగా తెల్చి చెప్పారు. దీంతో అధికారులు చేసేది ఏమీ లేక గురువారం భారీ బందోబస్తు మధ్య ఇక్కడికి వస్తామని చెప్పి వెనుదిరిగారు.

ప్రైవేటు భూమి వివాదం.. కార్మికులపై దాడి

పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదంటున్న బాధితులు

దుండిగల్: ఓ ప్రైవేటు భూమి వివాదంలో కొందరు వ్యక్తులు కార్మికులపై దాడి చేసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి సర్వే నం.183/పీ, 184/పీ, 187/పీ, 188/పీలో ఓ నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేపట్టింది. అక్కడ పదుల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారు. కాగా బుధవారం ఉదయం ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పనులను నిలిపేయాలని అక్కడి కార్మికులను అడ్డుకోవడంతో పాటు కత్తులు, ఇనుప రాడ్లతో దాడులకు దిగారు. దీంతో కార్మికులు ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోయారు. కాగా ఇదే విషయంపై దుండిగల్ పోలీసులను ఆశ్రయిస్తే కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

33 గుంటల భూమి నాదే..

ఎన్ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి



అధికారులు ఇచ్చిన సర్వే రిపోర్టు చూపిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ..

పంజగుట్ట: ఐదు రోజులుగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని సుచిత్ర వద్ద మాజీ మంత్రి మల్లారెడ్డి చేస్తున్న భూవివాదంలో అధికారులు అన్ని విధాలా సర్వే నిర్వహించి సదరు భూమి తనదే అని రిపోర్టు ఇచ్చినట్లు ఎన్ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోలీసు, కలెక్టర్, రెవెన్యూ అధికారులు మల్లారెడ్డి వర్గీయుల, తమ వర్గీయుల సమక్షంలో ఆదివారం పూర్తి సర్వే నిర్వహించి సర్వేనెంబర్ 82లో మల్లారెడ్డిది ఒక ఎకర 29 గుంటలు ఉందని... తనది 33 గుంటల భూమి అని తేల్చిచెప్పారని తెలిపారు. ఇప్పటికైనా మాజీ మంత్రి మల్లారెడ్డి తన అనుచరగణంతో నేలమట్టం చేసిన తమ బ్లూషీట్స్ తిరిగి ఏర్పాటు చేసి తమ భూమిని తమకు స్వచ్ఛందంగా అప్పజెప్పాలని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ వివరాలు వెల్లడించారు.

ప్రతిష్ఠాపనోత్సవానికి కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం



కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 31వ డివిజన్ పరిధిలోని శివాలయం, నల్లపోచమ్మ ఆలయ ముఖద్వారంపై దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ సీనియర్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి రూ.6లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతాని శ్రీనివాస్‌రావు, సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, డాలినాయుడు, లక్ష్మణ, రమణ, బాలకృష్ణ, రామచంద్ర నాయక్, శేషప్రసాద్, సత్యనారాయణ, సుధాకర్, సుదర్శన్, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివరెడ్డి, నాగభూషణం, ఉష తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో బీజేపీ పటిష్టతకు కృషి చేస్తాం

కుత్బుల్లాపూర్ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్



శివాజీరాజు, కో.కన్వీనర్



జేకే శేఖర్‌యాదవ్, కన్వీనర్


కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా జగద్గిరిగుట్టకు చెందిన జేకే శేఖర్‌యాదవ్ కన్వీనర్‌గా, కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన శివాజీరాజు కో.కన్వీనర్లుగా నియమితులయ్యారు. బుధవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జుల ప్రేమేందర్‌రెడ్డి రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు చెందిన కన్వీనర్లు, కో.కన్వీనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్‌గా నియమితులైన జేకే శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తన సేవలను గుర్తించి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు. కో.కన్వీనర్‌గా నియమితులైన శివాజీరాజు మాట్లాడుతూ... తాను 2016 నుంచి బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉంటూ స్థానిక సమస్యలపై పోరాడుతూ వస్తున్నానని తెలిపారు. కో.కన్వీనర్‌గా నియోకవర్గంలో పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్‌కాలనీకి చెందిన రాహుల్, ప్రీతికుమారి(24) భార్యాభర్తలు. వీరికి రితిక కుమారి(01) కుమార్తె ఉంది. రాహుల్ ఓ ఎలక్ట్రికల్ కంపెనీలో పని చేస్తుండగా ప్రీతి ఇంటి వద్దనే ఉంటుంది. కాగా గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం భర్త డ్యూటీకి వెళ్లడంతో ప్రీతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ మళ్లింపు పనులకు మోక్షం

● తుర్కు చెరువులో మురుగు చేరకుండా పనులు ● 2కి.మీ మేర పైపులైన్లు వేయనున్న అధికారులు ●నేరుగా నాలాలోకి మురుగు చేరేలా పనులు



నూతన డ్రైనేజీ పైపులైన్ గుగూల్ మ్యాప్



కొనసాగుతున్న డ్రైనేజీ పనులు



తుర్క చెరువు పక్క నుంచి నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు

నిజాంపేట్: డ్రైనేజీ నీటిని మళ్లించే పనులపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. దీంతో తుర్క చెరువు ఎగు ప్రాంతం నుంచి తుర్కు చెరువులోకి చేరే డ్రైనేజీ నీరు ఇక చెరువులోకి రాకుండా ఏకంగా చెరువు దిగువన ఉన్న రాజధాని స్కూల్ దగ్గర నాలాలోకి కలిసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పనులు ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం వర్షకాలంలో డ్రైనేజీ సమస్య తలెత్తి పలు కాలనీలు, బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా ఈ సమస్యతో ఆదిత్య గార్డెన్ కాలనీవాసుల అవస్థలు వర్ణానాతీతం. ఏడాది నుంచి ఈ పనుల కోసం కార్పొరేషన్ పలు ప్రణాళికలు సిద్ధం చేసి చివరకు పనులు ప్రారంభించారు. రూ. 6కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. సుమారు నెల రోజుల్లో ఈ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

రెండు కిలో మీటర్ల మేర పైపులైన్ పనులు...

ప్రగతినగర్‌లోని 2వ డివిజన్ ఆర్‌కే లేఅవుట్ నుంచి 21 డివిజన్‌లోని సాయినగర్, ఆదిత్య గార్డెన్, రాజీవ్ గృహకల్ప తుర్కు చెరువు బయటి నంచి రాజధాని స్కూల్ దిగువన నాలాలోకి అనుసంధానం చేసే విధంగా ఈ పనులు ప్రారంభించారు. 2 కీలో మీటర్ల మేర దూరం 900 డయా పైపులైన్ పనులు పూర్తి చేయనున్నారు.రాజధాని స్కూల్ వద్ద నాలా నుంచి పాపయ్యకుంట అక్కడి నుంచి ప్రగతినగర్ అంభీర్ చెరువులోకి చేరుతుంది.మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పనులను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

శాశ్వత పరిష్కారం దిశగా...

ప్రస్తుతం ఆర్‌కే లేఅవుట్ నుంచి సాయినగర్, ఆదిత్య గార్డెన్ మీదుగా నాలా ఉంది. అయితే ఇది భారీ వర్షాలు కురినప్పుడు నాలా పొంగి పొర్లి ప్రజల ఇండ్లల్లోకి నీరు చేరడంతో పాటు. వర్షం పడ్డ ప్రతి సారి ఆదిత్య గార్డెన్‌లో ఇండ్ల ముందు డ్రైనేజీ మురుగు నిల్వ ఉంటుంది. ఇటివల కురిసిన వర్షాల సమయంలో సైతం ఈ సమస్య పునరావృత్తం అయ్యింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా అధికారులు ఆదిత్య గార్డెన్‌లో నుంచి కాకుండా సాయినగర్ మీదుగా తుర్కు చెరువు పక్క నుంచి పైపు లైన్ వేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

తుర్కు చెరువులోకి వరద నీరు మాత్రమే....

ప్రస్తుతం తుర్క చెరువు ఎగువ ప్రాంతం నుంచి మొత్తం డ్రైనేజీ నీరు అంతా చెరువులోనే కలుస్తుంది. దీంతో చెరువులోని నీరు అంతా దుర్గంద భరితంగా మారాయి. అంతే కాకుండా చెరువులో గుర్రపుడెక్క చేరి చెరువంతా వ్యాపించింది. దీంతో దోమలు వృద్ధి పరిసరాల్లోని ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం చేపట్టే ఈ పనులతో తుర్క చెరువులోకి కేవలం వదర నీటిని మాత్రమే వచ్చే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే జరిగితే తుర్క చెరువు త్వరాలోనే మంచి నీటి చెరువుగా మారే అవకాశం ఉంది.

అన్ని ప్రాంతాల డ్రైనేజీ నీటిని మళ్లించాలి..

తుర్క చెరువులోకి డ్రైనేజీ నీరు చేరే అన్ని ప్రాంతాల నుంచి చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకుంటేనే ఫలితం ఉంటుంది. ప్రస్తుతం తుర్క చెరువులోకి స్ప్రింగ్ విల్లాస్, జర్నలిస్టు కాలనీల నుంచి సైతం డ్రైనేజీ నీరు చేరుతుంది. ఈ నీటిని సైతం చెరువులో కలువకుండా చర్యలు తీసుకుంటే తప్ప ప్రయోజనం ఉండదు. ఇక్కడ నుంచి సైతం చెరువు పక్క నుంచి పైపు లైన్ వేసి నేరుగా రాజధాని స్కూల్ దిగువన ఉన్న నాలాలోకి చేరే విధంగా ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే పూర్తిస్థాయిలో తుర్క చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా నివారించే అవకాశం ఉంటుంది.

ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం..



తుర్క చెరువులోకి మురుగు కలువకుండా మళ్లించేందుకు ఎన్ని నిధులైనా వెచ్చించి పనులను పూర్తి చేస్తాం. ప్రస్తుతం జరిగే డ్రైనేజీ పైపులైన్ పనుల వల్ల ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ప్రజా సమస్యలను పరిష్కారించేందుకు నిజాంపేట్ కార్పొరేషన్ పాలక వర్గం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుంది.

- కొలను నీలా గోపాల్‌రెడ్డి, మేయర్ నిజాంపేట్

ప్రజలకు ముప్పు తప్పించేందుకే..



సాయినగర్, ఆదిత్యగార్డెన్ కాలనీల ప్రజలకు వాటిల్లే ముప్పు నుంచి తప్పించేందుకు కొంత కాలంగా ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెల్లాం. ప్రస్తుతం ఈ పనులు పూర్తి యితే ప్రజలకు ఎలాంటి ముప్పు ఉండదు.

- కాసాని శీరిష, కార్పొరేటర్, 21వ డివిజన్

జనాభాను దృష్టిలో పెట్టుకుని..



2వ డివిజన్‌లోని ప్రగతినగర్‌లోని కేజీఆర్ ఫంక్షన్ పరిసర ప్రాంతాల అపార్ట్ మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీకాలనీలు, ఎన్ఆర్ఐ కాలనీ ప్రజలతో పాటు 22వ డివిజన్‌లోని కాలనీ ప్రజలకు ఈ డ్రైనేజీ పైపులైన్ పనులు ఎంతగానో ఉపయోగపడుతాయి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ఈ సమస్యపై పలు మార్లు కౌన్సిల్‌లో సైతం చర్చించాం.

- చిట్ల దివాకర్, కార్పొరేటర్ 2వ డివిజన్

వైభవంగా నరసింహస్వామి జయంతి ఉత్సవాలు



సుభాష్‌నగర్: మెట్‌కానిగూడలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అభిషేకాలు అర్చన, స్వామివారికి లక్ష పుష్పార్చన వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య జరిగింది. కార్పొరేటర్ రావుల శేషగిరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం స్వామివారి కల్యాణం, అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్య తరలిరావాలని ఆలయ కమిటీ పేర్కొంది.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూ ప్రధాన క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు 'మనూ' పాలిటెక్నిక్ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఉర్దూ మీడియం నుంచి లేదా ఉర్దూను ఒక సబ్జెక్టుగా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమో కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌లో డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి నాలుగు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని, ప్రాస్పెక్టస్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9848171044లో సంప్రదించాలన్నారు.